


sahanamvande.com

సహనం వందే

epaper.sahanamvande.com

హైదరాబాద్ | 12-11-2026 గురువారం | సంపుటి-02 సంచిక : 192 EDITOR: ROHINI



జేఎన్టీయూ రీసెర్చ్ స్కామ్?

సీబీఐకి ఇచ్చిన ఫిర్యాదులో షాకింగ్ నిజాలు



- కేంద్ర ప్రభుత్వ నిధులపై ఆడిట్ అభ్యంతరాలు
- పరిశోధన నిధుల నిబంధనలకు తూట్లు... ఆడిట్ రట్టు
- టెండర్లు లేకుండానే భారీ కొనుగోళ్లు... పత్రాలు గల్లంతు
- ప్రభుత్వ ఆడిటర్ ఉండగా ప్రైవేట్ ఆడిటర్లు ఎందుకు?
- యూనివర్సిటీ అధ్యాపకుల ఖర్చులపై ఆడిట్ కొరడా
- గత ప్రభుత్వంలో జరిగిన అక్రమాలపై సర్కార్ ఆరా

పరిశోధనలకు ప్రోత్సాహం ఇవ్వాలంటే విశ్వవిద్యాలయాలకు నిధులు అవసరం. కొత్త పరికరాలు కొనాలి. ప్రయోగాలు నిర్వహించాలి. విద్యార్థులు, అధ్యాపకులు కొత్త ఆవిష్కరణల దిశగా అడుగులు వేయాలి. ఇందుకోసం కేంద్ర ప్రభుత్వ సంస్థలు కోట్లాది రూపాయల నిధులు మంజూరు చేస్తున్నాయి. అయితే ఆ నిధుల ఖర్చుకు సంబంధించిన లెక్కలు మాత్రం పక్కాగా ఉండాలి. ప్రతి కొనుగోలుకు ఆధారాలు ఉండాలి. కానీ జేఎన్టీయూలో పరిశోధన నిధుల వినియోగంపై రాష్ట్ర ఆడిట్ శాఖ లేవనెత్తిన ప్రశ్నలు ఇప్పుడు చర్చనీయాంశంగా మారాయి. - సహనం వందే, హైదరాబాద్

అఖిల భారత సాంకేతిక విద్యా మండలి (ఏఐసీటీఈ) 2020 మార్చి 13న రీసెర్చ్ ప్రమోషన్ స్కీమ్ కింద జేఎన్టీయూకు తొలి విడతగా 22 లక్షల రూపాయలు విడుదల చేసింది. ఇందులో పరికరాల కొనుగోలుకు 19 లక్షలు, మిగిలిన మొత్తాన్ని ఇతర ప్రాజెక్టు అవసరాలకు వాడుకోవాలని స్పష్టమైన మార్గదర్శకాలు ఇచ్చింది. అయితే, కె.పి. భాగ్య వెంకట కుమార్ సీబీఐకి ఇచ్చిన ఫిర్యాదుతో ఈ నిధుల వినియోగంలో జరిగిన అక్రమాలు ఒక్కొక్కటిగా బయటపడ్డాయి. దీనిపై 2024 అక్టోబర్ 30న రాష్ట్ర ఆడిట్ శాఖ యూనివర్సిటీ అధికారులకు లేఖ రాస్తూ, నిధుల ఖర్చుకు సంబంధించి పక్కా ఆధారాలు లేవని తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది.

టెండర్లు లేకుండానే పరికరాల కొనుగోలు

ఈ వ్యవహారంలో ప్రధానంగా 19 లక్షల రూపాయలతో చేపట్టిన ల్యాబ్ పరికరాల కొనుగోలుపై ఆడిట్ అధికారులు తీవ్ర ప్రశ్నలు లేవనెత్తారు. 2020 ఆగస్టు 27 నాటి ఉత్తర్వుల కాపీలతో పాటు టెండర్ నోటిఫికేషన్ ప్రతులు, కొటేషన్ల వివరాలు సమర్పించాలని ఆదేశించారు. నిబంధనల ప్రకారం టెండర్లు పిలవకుండానే ఇష్టారాజ్యంగా కొనుగోళ్లు జరిపారనే ఆరోపణలు ఉన్నాయి. అసలు కొనుగోలు చేసిన పరికరాలు వర్సిటీలో ఉన్నాయో లేదో కూడా స్పష్టత లేకపోవడంతో, ప్రధాన పరిశోధకుడు, విభాగాధిపతి, ప్రిన్సిపాల్ సంతకాలతో కూడిన స్టాక్ రిజిస్టర్ ఆధారాలను చూపించాలని ఆడిట్ శాఖ తేల్చిచెప్పింది.

పన్నుల చెల్లింపుల్లో తేడాలు...

పరికరాలకు సంబంధించిన 19 లక్షల రూపాయల ఇన్వాయిస్‌పై ఐదు శాతం జీఎస్టీ చెల్లించినట్లు చూపిన అధికారులు, నిబంధనల ప్రకారం మినహాయించాల్సిన రెండు శాతం టీడీఎస్‌ను ఎందుకు కట్ చేయలేదో వివరించలేకపోయారు. మరోవైపు, మహదేవ్ ఎంటర్‌ప్రైజెస్ నుంచి 86 వేల రూపాయల విలువైన కెమికల్స్ కొనుగోలు లోనూ అవకతవకలు బయటపడ్డాయి. సదరు సంస్థ టీడీఎస్ చెల్లించినట్లు లేఖ ఇచ్చినప్పటికీ, ఆ మొత్తం ప్రభుత్వ ఖాతాలో జమ అయినట్లు చలాన్లు సమర్పించలేదు. పైగా ఆ రసాయనాలను స్టాక్ రిజిస్టర్‌లో నమోదు చేయకపోవడంతో పాటు, 8 వేల రూపాయల ప్రాసెసింగ్, ఈఎండీ ఫీజులకు సంబంధించిన అనుమతి ఉత్తర్వులను కూడా అధికారులు చూపించలేకపోయారు.

ప్రభుత్వ ఆడిటర్ ఉండగా ప్రైవేట్ ఆడిటర్లు ఎందుకు?

ఏఐసీటీఈ నిబంధనల ప్రకారం పరిశోధన నిధులను సాధారణ ఖాతాలతో కలపకుండా ప్రత్యేకంగా నిర్వహించాలి. కొనుగోలు చేసిన ఆస్తులను రిజిస్టర్‌లో నమోదు చేస్తూ జీఎఫ్ఆర్-19 విధానాన్ని పాటించాలి. ఆర్థిక సంవత్సరం ముగిసిన నెల రోజుల్లోగా యుటిలైజేషన్ సర్టిఫికెట్లు, ప్రాజెక్టు పూర్తయిన రెండు నెలల్లోగా తుది నివేదికలు ఇవ్వాలనే నిబంధనలను పూర్తిగా విస్మరించారు. క్యాంపస్‌లోనే ప్రభుత్వ ఆడిటర్ అందుబాటులో ఉన్నప్పటికీ, నిబంధనలకు విరుద్ధంగా ప్రైవేట్ చార్టర్డ్ అకౌంటెంట్లతో లెక్కలను ధ్రువీకరించి పంపడంపై ఆడిట్ శాఖ మండిపడింది. అంతేకాదు, 2020-24 మధ్య నిధులు పొందిన పలువురు అధ్యాపకులు గడువు ముగిసినా ఇప్పటికీ ఖర్చుల వివరాలు సమర్పించలేదని నివేదిక స్పష్టం చేసింది.

అధ్యాపకులపై సమీక్షకు ఆదేశం..

ఖర్చుల వివరాలు ఇవ్వని అధ్యాపకులందరినీ అప్రమత్తం చేసి తక్షణమే పత్రాలు సేకరించాలని, అన్ని పరిశోధన ప్రాజెక్టులపై అంతర్గత సమీక్ష నిర్వహించాలని ఆడిట్ శాఖ సూచించింది. ఆడిట్ అడిగిన ప్రతి పత్రాన్ని, చెల్లింపు ఆధారాలను సమర్పించాల్సిన బాధ్యత పూర్తిగా జేఎన్టీయూ అధికారులపైనే ఉంది. ప్రతిష్టాత్మక విశ్వవిద్యాల యంలో జరిగిన ఈ నిధుల గోల్‌మాల్ విద్యార్థి లోకాన్ని తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. గల్లంతైన పత్రాలను సేకరించి అధికారులు లెక్కలను సరిచేస్తారా, లేక దోషులను రక్షించే ప్రయత్నం చేస్తారా అన్నది ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. బాధ్యులపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటేనే భవిష్యత్తులో ఇలాంటి అక్రమాలకు అడ్డుకట్ట పడుతుంది.



గత ప్రభుత్వ అక్రమాలపై సర్కార్ ఆరా


గత ప్రభుత్వ హయాంలో జేఎన్టీయూలో చోటుచేసుకున్న అక్రమాలపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించింది. ఈ వ్యవహారంపై ఏకంగా సీబీఐకి ఫిర్యాదు అందడంతో రాష్ట్ర విద్యాశాఖ, ఉన్నత విద్యామండలి అప్రమత్తమైనట్లు తెలుస్తోంది. ఇప్పటికే ఈ అంశంపై ప్రత్యేక దృష్టి సారించినట్లు సమాచారం. మరోవైపు విద్యాశాఖ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పరిధిలోనే ఉండటంతో ఈ వ్యవహారంపై ప్రభుత్వం మరింత లోతుగా విచారణ జరిపించే అవకాశం ఉందన్న చర్చ జరుగుతోంది.

హైకోర్టుల పేరుతో నకిలీ తీర్పులు

రాజస్థాన్, అలహాబాద్ కోర్టులకు షాక్!

- కేంద్ర ప్రభుత్వాన్నే బురిడీ కొట్టించిన నేరగాళ్లు!
- నకిలీ ముద్రలతో 129 వెబ్‌సైట్ల బ్లాక్!
- క్యూ ఆర్ కోడ్‌తో అధికారులకు మాయ!
- న్యాయవ్యవస్థ విశ్వసనీయతకు కొత్త ముప్పు!

ఈ ఏడాది జూలై 19వ తేదీ రాత్రి 8 గంటల 59 నిమిషాలకు టెలికాం శాఖకు ఒక ఈమెయిల్ అందింది. ఆర్యన్ చౌదరి అనే అడ్వకేట్ ఆన్ రికార్డ్ పేరుతో రాజస్థాన్ హైకోర్టు ఉత్తర్వులను పంపించారు. వాటి ఆధారంగా జూలై 21న 34 బెట్టింగ్ వెబ్‌సైట్లను బ్లాక్ చేయాలని అధికారులు ఆదేశించారు. అనంతరం ఆగస్టు 22న కార్తికేయ పాండే అనే వ్యక్తి మరో ఈమెయిల్ పంపించారు. అందులో అలహాబాద్ హైకోర్టు పేరుతో నకిలీ ఉత్తర్వులు జతచేశారు. ఈసారి 95 వెబ్‌సైట్లను నిలిపివేయాలని కోరారు. దీంతో సెప్టెంబర్ 2న మరోసారి నిరోధక ఆదేశాలు జారీ అయ్యాయి. ఇలా రెండు సందర్భాల్లో కలిపి 129 వెబ్‌సైట్లు నిలిచిపోయాయి. విచిత్రమేంటంటే నకిలీ ఉత్తర్వుల ఆధారంగా ఇలా ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం ఆందోళన కలిగిస్తుంది. అసలు ఏం జరిగింది? - సహనం వందే, న్యూఢిల్లీ



కోర్టు తీర్పు అంటే ప్రభుత్వానికైనా, సామాన్యులకైనా ఎంతో నమ్మకం. న్యాయమూర్తి సంతకం, కోర్టు ముద్ర ఉంటే అది అధికారిక ఉత్తర్వేనని నమ్ముతాం. కానీ ఆ నమ్మకాన్నే సైబర్ నేరగాళ్లు తమకు అనుకూలంగా మార్చుకున్నారు. రాజస్థాన్ హైకోర్టు, అలహాబాద్ హైకోర్టుల పేర్లతో నకిలీ ఉత్తర్వులు సృష్టించి కేంద్ర టెలికాం శాఖకు పంపించారు. అధికారిక పత్రాల్లో ఉండే జాతీయ చిహ్నం, కోర్టు ముద్రలు, న్యాయమూర్తుల వివరాలు, సంతకాలను అనుకరించారు. జడ్జీల సంతకాలను ఫోర్జరీ చేశారు. వాటిని నిజమైన ఉత్తర్వులుగా భావించిన అధికారులు ఇంటర్నెట్ సర్వీస్ ప్రొవైడర్లకు 129 బెట్టింగ్ వెబ్‌సైట్లను నిలిపివేయాలని ఆదేశించారు.ప్రముఖ వార్తా సంస్థ రాయిటర్స్ చేపట్టిన పరిశోధనతో ఈ వ్యవహారం వెలుగులోకి వచ్చింది.

రాయిటర్స్ పరిశోధనతో బట్టబయలు!

ఈ ఉత్తర్వులపై రాయిటర్స్ ప్రత్యేక పరిశోధన చేపట్టి సంబంధిత హైకోర్టు అధికారులను సంప్రదించింది. రాజస్థాన్ హైకోర్టు రిజిస్ట్రార్ కార్యాలయం తమ వద్ద అలాంటి ఉత్తర్వులేవీ నమోదు కాలేదని స్పష్టం చేసింది. అవి నకిలీ పత్రాలని తేల్చింది. మరోవైపు అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తి గరిమా ప్రసాద్ పేరుతో కూడా నకిలీ సంతకం పెట్టినట్లు గుర్తించారు. ఆమె అలాంటి ఉత్తర్వులేవీ జారీ చేయలేదని వెల్లడైంది. అంతేకాకుండా నకిలీ పత్రాలను నిజమైనవిగా నమ్మించేందుకు వాటిపై క్యూ ఆర్ కోడ్‌ను కూడా ముద్రించారు. సాధారణంగా ఇలాంటి కోడ్‌ను స్కాన్ చేస్తే కోర్టు అధికారిక వెబ్‌సైట్‌లోని కేసు వివరాలు కనిపించాలి. కానీ ఈ పత్రంలోని కోడ్‌ను స్కాన్ చేస్తే మరో వెబ్‌పేజీ తెరుచుకునేలా ఏర్పాటు చేశారు. అక్కడ కేసు నంబరుకు సంబంధించిన ఒకే ఒక్క లైన్ కనిపించేలా చేసి పత్రం నిజమైనదేనన్న భ్రమ కలిగించే ప్రయత్నం చేశారు. ప్రభుత్వ శాఖలకు చేరిన పత్రాల్లోని ఈ మోసాన్ని గుర్తించలేకపోవడం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది.

పోలీసుల దర్యాప్తు.. ఏఐ ప్రమేయంపైనా ఆరా!


రాయిటర్స్ పరిశోధనతో వ్యవహారం బయటపడిన తర్వాత అలహాబాద్ హైకోర్టు అధికారులు స్పందించారు. ఈ నెల 6న పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఉత్తరప్రదేశ్ సైబర్ క్రైమ్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. నకిలీ ఉత్తర్వుల తయారీ, ఫోర్జరీ, మోసం వంటి అంశాలపై విచారణ సాగుతోంది. ఈ పత్రాలను ఎవరు రూపొందించారు? వీటి వెనుక వ్యక్తులు ఉన్నారా? ఏదైనా సంస్థ ప్రమేయం ఉందా? అనే కోణాల్లో పోలీసులు పరిశీలిస్తున్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సాయంతో ఈ పత్రాలను తయారు చేశారా అనే అంశంపైనా ఆరా తీస్తున్నారు. అయితే ఇప్పటివరకు ఈ కేసులో ఎవరినీ అరెస్టు చేయలేదని అధికారులు వెల్లడించారు. న్యాయమూర్తుల నకిలీ సంతకాలతో తీర్పులు, ఉత్తర్వులు సృష్టించడం న్యాయవ్యవస్థపై ప్రజలకున్న నమ్మకానికి ముప్పని సుప్రీంకోర్టు కూడా ఆందోళన వ్యక్తం చేసింది. ఏఐ సాయంతో తప్పుడు తీర్పులు సృష్టించే ధోరణి న్యాయవ్యవస్థకు కొత్త సవాలుగా మారుతోందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

యంగ్ రాక్స్... భక్తి పీక్స్

జెన్ జెడ్ ట్రెండ్... దేవుళ్లతో ఫ్రెండ్ షిప్

- నేటి యువతరాన్ని ఆకర్షిస్తున్న తీర్థ యాత్రలు
- పుణ్యక్షేత్రాల బుకింగ్స్‌లో యువతదే 53 శాతం వాటా
- తిరుపతి నుంచి అయోధ్య వరకు సందడే సందడి
- దైవ సన్నిధిలో ప్రశాంతత వెతుక్కుంటున్న నేటి తరం

ఒకప్పుడు తీర్థయాత్ర అంటే దేవుడిని దర్శించుకోవడం, పుణ్యక్షేత్రంలో పూజలు చేసి తిరిగి రావడం. కానీ ఇప్పుడు ముఖ్యంగా యువత ఆలోచనల్లో మార్పు కనిపిస్తోంది. భక్తితో పాటు పర్యాటకం, చరిత్ర, సంస్కృతి, విశ్రాంతికి ప్రాధాన్యం ఇస్తున్నారు. దేవుడిని దర్శించుకోవడమే కాకుండా ఆ ప్రాంతంలోని చారిత్రక ప్రదేశాలను సందర్శించడం, స్థానిక జీవన విధానాన్ని తెలుసుకోవడం, ప్రశాంతమైన వాతావరణంలో సమయం గడపడం వంటి అంశాలను ప్రయాణ ప్రణాళికలో చేర్చుకుంటున్నారు. దీంతో తీర్థయాత్రలు కేవలం ఆధ్యాత్మిక కార్యక్రమాలుగా కాకుండా విభిన్న అనుభవాలను అందించే ప్రయాణాలుగా మారుతున్నాయి. - సహనం వందే, హైదరాబాద్



కొత్త తరం ప్రయాణాల విషయంలో సంప్రదాయ పద్ధతులకు భిన్నంగా వ్యవహరిస్తోంది. గతంలో కుటుంబ పెద్దలు నిర్ణయించిన తీర్థయాత్రలకు వెళ్లడం ఎక్కువగా కనిపించేది. ఇప్పుడు యువతే ఎక్కడికి వెళ్లాలి, అక్కడ ఏమి చూడాలి, ఆ ప్రాంత ప్రత్యేకత ఏమిటి అనే అంశాలను ముందుగానే పరిశీలించి ప్రణాళికలు రూపొందించుకుంటోంది. ముఖ్యంగా జెన్ జెడ్ తరానికి చెందినవారు భక్తిని కేవలం ప్రార్థనలకే పరిమితం చేయడం లేదు. ఆధ్యాత్మిక ప్రాధాన్యంతో పాటు చారిత్రక నేపథ్యం, స్థానిక సంస్కృతి, విశ్రాంతికి ఉన్న అవకాశాలను కూడా పరిగణనలోకి తీసుకుంటున్నారు. ఈ మార్పు ఆధ్యాత్మిక పర్యాటక రంగంలో యువత ప్రాధాన్యాన్ని పెంచుతోంది.

బుకింగ్స్‌లో 53 శాతం యువత వాటా

భారత్‌లో ఆధ్యాత్మిక పర్యాటకం విస్తరిస్తున్న తీరును తాజా గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. దేశీయంగా జరిగే రాత్రి బసతో కూడిన ప్రయాణాల్లో మతపరమైన యాత్రల వాటా దాదాపు 48 శాతంగా ఉందని ఇండియా టుడే మ్యాగజైన్ వెల్లడించింది. మరోవైపు 2025-26 ఆర్థిక సంవత్సరంలో ఆధ్యాత్మిక ప్రయాణాలకు సంబంధించిన బుకింగ్స్‌లో జెన్ జెడ్, యువ ప్రయాణికుల వాటా 53 శాతంగా నమోదైంది. ఒకప్పుడు వృద్ధులు, కుటుంబాలు ఎక్కువగా పాల్గొనే తీర్థయాత్రల్లో ఇప్పుడు యువత కూడా గణనీయంగా భాగస్వాములవుతోంది. ఈ గణాంకాలు ఆధ్యాత్మిక ప్రయాణాలు కొత్త తరానికి కూడా ఆకర్షణీయమైన ఎంపికగా మారాయని సూచిస్తున్నాయి.

తిరుపతి నుంచి అయోధ్య వరకు సందడి

దేశంలోని ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రాలు యువ ప్రయాణికులకు ప్రధాన ఆకర్షణగా నిలుస్తున్నాయి. తిరుపతి, వారణాసి, అయోధ్య వంటి ప్రాంతాలకు వెళ్లేవారి ఆసక్తి ఆలయ దర్శనంతోనే ముగియడం లేదు. అక్కడి వారసత్వం, చారిత్రక నేపథ్యం, స్థానిక జీవన విధానాన్ని తెలుసుకోవాలనే ఉత్సాహం పెరుగుతోంది. ఒకే ప్రయాణంలో భక్తి, విహారం, చరిత్ర, సంస్కృతిని ఆస్వాదించాలనే అభిరుచి బలపడుతోంది. ఈ ధోరణి పర్యాటక రంగానికి కొత్త వ్యాపార అవకాశాలను తెస్తోంది. వసతి, రవాణా, స్థానిక పర్యాటక సేవలు, ఆహారం వంటి రంగాలకు డిమాండ్ పెరిగే అవకాశం ఏర్పడుతోంది. యువత ప్రయాణాన్ని ఒక సమగ్ర అనుభవంగా చూస్తుండటంతో ఆధ్యాత్మిక కేంద్రాల చుట్టూ పర్యాటక కార్యకలాపాలు విస్తరిస్తున్నాయి.

రద్దీ నిర్వహణే అసలైన సవాలు

ఆధ్యాత్మిక పర్యాటకానికి ఆదరణ పెరగడం వల్ల ఆదాయ అవకాశాలు విస్తరిస్తున్నప్పటికీ,ప్రముఖ పుణ్యక్షేత్రాలపై ఒత్తిడిపెరిగే ప్రమాదం ఉంది. భారీ సంఖ్యలో సందర్శకులు వస్తే ఆయా పట్టణాలు రద్దీని తట్టుకోగలవా? వారికి అవసరమైన వసతి, రవాణా, పారిశుద్ధ్యం, తాగునీరు వంటి సౌకర్యాలు కల్పించగలవా? అనే ప్రశ్నలు కీలకంగా మారుతున్నాయి. పర్యాటక అభివృద్ధి పేరుతో పుణ్యక్షేత్రాల చారిత్రక, సాంస్కృతిక ప్రత్యేకత దెబ్బతినకుండా చూడాలి. భక్తులకు మెరుగైన అనుభవం కల్పించడంతో పాటు స్థానిక ప్రజల అవసరాలు, పర్యావరణ పరిరక్షణకు కూడా ప్రాధాన్యం ఇవ్వాలి. మొత్తంగా తీర్థయాత్రల నిర్వచనాన్ని యువత మారుస్తోంది. ఈ కొత్త ధోరణి అందించే ఆర్థిక అవకాశాలను వినియోగించుకుంటూనే పుణ్యక్షేత్రాల పవిత్రత, ప్రత్యేకతను కాపాడుకోవడం ప్రభుత్వాలు, పర్యాటక రంగం ముందున్న ప్రధాన సవాలు.